# 3

# తండ్రియైన దేవుడు ఎవరు?

దేవుడు. ఏ వ్యక్తిగాని లేక వస్తువుగాని ఆయనకు మించినది ఏదీ లేదు. ఆయనకు పూర్ణమైన అధికారం ఉంది. ఆయన అందరికి పైగానున్నాడు.

అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. మానవ కల్పితమైన ఉద్దేశాలను, రాయి, కర్ర, మట్టి వగైరాలతో నిర్మింపబడినవాటిని నరుడు ఆరాధించి తప్పుచేసినా, ఆరాధన అనేది ఆ ఒక్క దేవునికే న్యాయసమ్మతంగా చెందుతుంది. దేవుడు ఒక్కడే; ఆయన ఆరాధనకు పాత్రుడు. మరొక ఊహామాత్రునికి గాని, జీవించి ఉన్నవానికి గాని పేరుకు చేసే ఆరాధన తప్పు ఆరాధనయని అనిపించుకొంటుంది.

దేవునికి చెందవలసిన గౌరవాన్ని కొద్ది మాటల్లో వివరించగోరినట్లయితే, 1 తిమోతి 1:17లో వ్యక్తపరచినదానికంటే సూక్ష్మమైనది కనుగొనడం కష్టతరమౌతుంది. అక్కడ యిలా వ్రాయబడింది "... సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగును గాక. ఆమెన్." ప్రాచీన ఇశ్రాయేలుచే మాటిమాటికి వల్లింపబడిన ప్రతిపాదనలో దేవుని గూర్చిన సత్యము సంక్షిప్తం చేయబడింది: "... ఇశ్రాయేలూ వినుము. మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా. నీ పూర్ణ హృదయము తోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితీయో. 6:4, 5). దేవుడు ఎవరు అనే విషయంలో, ప్రతివాని హృదయమందు నాటబడవలసిన తీర్మానాన్ని ప్రభువైన యేసు యిలా ప్రకటించారు: "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను" (మత్తయి 4:10బి).

దేవత్వంలో ముగ్గురు వ్యక్తులున్నట్టు లేఖనాలు వర్ణిస్తున్నాయి. దేవత్వం ఒక్కటే, అయినా అందులో ముగ్గురు, అంటే – తండ్రియైన దేవుడు; కుమారుడైన దేవుడు; పరిశుద్ధాత్మ దేవుడు అనే ముగ్గురు వ్యక్తులున్నారు. దేవ స్వభావంలో ఈ ముగ్గురు సమానమైయుండి, వారిలో ప్రతి ఒక్కరు నిత్యులైయున్నారు. ప్రతి ఒక్కరికి తనదైన

వ్యక్తిత్వముంది, ఆ వ్యక్తిత్వము ప్రకృతికి అతీతమైన వివేకము, ఉద్వేగము, చిత్తము అనేవాటిని కనుపరచుతోంది; అయినా ఈ ముగ్గురికి స్వభావము, ఉద్దేశము, అంటే ఎసెన్స్ ఒక్కటైయుంది.

వ్యక్తులుగా ముగ్గురైయున్నా వారికున్న ఏక స్వభావము, ఉద్దేశము, నిర్మాణమునూ అనుసరించి దేవుడు ఒక్కడే అనే ఈ భావనను దేవత్వమని, దైవ కుటుంబమని (అపో. 17:29; రోమా 1:20; కొలస్సీ. 2:9)[1] పిలుస్తారు. ఈ గొప్ప సత్యము మన అవగాహనకు అతీతమైయుండవచ్చుగాని – దేవుని గ్రంథమందు అది స్పష్టంగా బోధింపబడినందున, అది మన విశ్వాసానికి అతీతమయింది కాదు. దాన్ని మనం విశ్వాసముతో అంగీకరిస్తాం–అది మనం ఊహించిన దాన్నిబట్టి కాదు, అది సత్యమైయుండ వచ్చునని మనం వాదించినందున కాదు, మన చుట్టునున్న ప్రపంచాన్ని పఠించి లేక పరిశీలించి నేర్చుకొన్నందున కూడా కాదు. ఈ సత్యాన్ని మనం అంగీకరించి విశ్వసించింది దైవ ప్రేరేపితమైన లేఖనాల ద్వారా మనకు అనుగ్రహింపబడిన దానిని బట్టియే.

దేవత్వము, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మాలతో కూడియుందనే భావన లేఖనాలలో నేరుగా వివరింపబడలేదు, కాని అది గుప్తం చేయబడింది. దేవత్వమందు దైవికమైన పేరు సహితము గుప్తమైయున్నట్టు పాత నిబంధన రచనలు తెలుపుతున్నాయి, అది హెబ్రీలో, బహు వచన రూపంలో ఉన్న “ఎలోహీం” అనే పదం. ఆదికాండం 1:26 వంటి – రిఫరెన్సులలో, పాత నిబంధన రచనలు “దేవుడు” అనే పదముతో బహువచనపు సర్వనామమును ఉపయోగించాయి–“మనము మన పోలికె చొప్పున నరులను చేయుదము ...”[2]

క్రొత్త నిబంధనలోనైతే, దేవత్వములోని ముగ్గురు వ్యక్తులను గూర్చి మనం చదువుతాం.

ప్రభువైన యేసు బాప్తిస్మం పొందిన సమయంలో, పావురమువలె పరిశుద్ధాత్మ ఆయన మీదికి దిగాడు, తండ్రియైన దేవునినుండి వచ్చిన శబ్దము – “ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు,...” అని ప్రకటించింది (మత్తయి 3:17). పరిశుద్ధాత్మను పంపుతానని మన ప్రభువు తన శిష్యులకు వాగ్దానము చేసినప్పుడు, తనను గురించి, తండ్రియైన దేవుని గురించి, ఆత్మను గురించి ఇలా ప్రస్తావించాడు : “తండ్రియొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు **ఆదరణకర్త,** అనగా **తండ్రియొద్దనుండి** బయలుదేరు సత్యస్వరూపియైన **ఆత్మ** వచ్చినప్పుడు ఆయన **నన్ను** గూర్చి సాక్ష్యమిచ్చును” (యోహాను 15:26; ఒత్తి పలికింది నాది).

మానవుని విమోచించే కార్యక్రమంలో దేవత్వంలోని ముగ్గురు సభ్యులు పని కలిగియున్నారు. ఇందు విషయమై పేతురు యిలా అన్నాడు, "**తండ్రియైన దేవుని** భవిష్యద్ జ్ఞానమునుబట్టి, **ఆత్మవలని** పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, **యేసు క్రీస్తు** రక్తమువలన ప్రోక్షింపబడుటకును ఏర్పరచబడినవారికి ..." (1 పేతురు 1:2; ఒత్తి పలికింది నాది). ప్రార్థనలో మనం దేవుని సన్నిధికి వెళ్లే విషయంలో సహితము దేవత్వం కన్పిస్తోంది: ప్రభువైన **యేసు** ద్వారానే "ఒక్క **ఆత్మయందు తండ్రి** సన్నిధికి చేరగలిగి యున్నాము" అని పౌలు తెలిపాడు (ఎఫెసీ. 2:18; ఒత్తి పలికింది నాది).

బాప్తిస్మము ముగ్గురైయున్న దైవత్వం యొక్క నామంలో యివ్వబడుతున్నట్టు ఘనత్వముగల ఉత్తరువు (Great Commission) చిత్రిస్తుంది. "కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు...." (మత్తయి 28:19, 20).

బైబిలు అంతటిలో, తండ్రియైన దేవుడు ఎల్లవేళలా ("ఆయన") అనే పుంలింగంలోని వ్యక్తిగతమైన సర్వనామంతో సూచింపబడ్డారు. ఆయన తండ్రి, సృష్టికర్త, యెహోవా, సర్వశక్తుడు, ప్రభువైన దేవుడు. దేవత్వంలోని ముగ్గురు వ్యక్తులలో మొదటివాడుగా ఆయన నిలుస్తాడు. జ్ఞానములోను, శక్తిలోను, ప్రేమలోను, కనికరములోను, న్యాయంలోను అందరికిపైగా ఉన్నవాడైనట్టు బైబిలు చూపుతుంది. ఈ విశ్వమంతటిని ప్లాన్‌వేసి, డిజైన్‌చేసి, సృజించినవాడుగా ఆయన అత్యున్నతమైన అధికారిగా, సర్వాన్ని ఏలువాడుగా, శక్తులన్నిటిమీదను, అధిపతిగా ఉన్నాడు. తన్ను ఆరాధించి తనకు లోబడు వారికందరికిని ఆయన తండ్రియైయున్నాడు. మనము ఆయనయందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము (అపొ. 17:28).

అద్వితీయ సత్యదేవుడుగా సమస్త జనములు, దేశములు, సకల గోత్రములవారు ఆయనను దేవుడుగా ఆరాధించాలి. యేసు క్రీస్తు ద్వారానే నేడు జనులు ఆయన యొద్దకు రావాలి. దేవదూతల ద్వారాగాని, పరిశుద్ధుల ద్వారాగాని, యితర ప్రజలద్వారా గాని-వారు ఎంత మంచివారుగా ఉండినా లేక ఉంటున్నా, జీవించినవారైనా మృతులైనవారైనా మనము దేవుని సమీపింపలేం. దైవమానవులకు మధ్య ఉన్న ఏకైక మధ్యవర్తి ఆయన కుమారుడైన యేసే (1 తిమోతి 2:5). దేవుని యొద్దకు వచ్చుటకు మనుష్యులకున్న ఏకైక మార్గము - యేసుక్రీస్తే. "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" అని ప్రభువైన యేసు

అన్నాడు (యోహాను 14:6).

దేవత్వంలోని రెండవ వ్యక్తి – ప్రభువైన యేసు క్రీస్తు. ఆయన ద్వారా తండ్రియైన దేవుడు లోకాన్ని, నరుని సృజించాడు (కొలస్సీ. 1:16). నరునితో ఆయనకున్న సంబంధాన్ని బట్టి యేసు "మనుష్యకుమారుడ"ని పిలువబడ్డాడు; దేవునితో ఆయనకున్న సంబంధాన్ని బట్టి ఆయన "దేవుని కుమారుడు" అని పిలువబడ్డాడు. దేవత్వంలోని వ్యక్తులలో ఆయన ఒక్కడు మాత్రమే మానవ శరీరాన్ని ధరించి భౌతికంగా ఈ లోకంలో జీవించాడు. మానవాళికి ఆయన రక్షకుడును విమోచకుడునైయున్నాడు. ప్రజలందరిచే ఆయన ఘనపరచబడి, సేవింపబడవలసిన వాడైయున్నాడు. ఆయన ద్వారా భూలోక మంతా తండ్రియైన దేవుని ఆరాధించే అవకాశాన్ని ఆయన ప్రసాదించాడు.

> అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమిక్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ. 2:9–11).

దేవత్వంలోని మూడవ వ్యక్తి పరిశుద్ధాత్మ. దేవునికినీ, క్రీస్తుకునూ, ఏ స్వభావమో, ఏ స్వరూపమో అదే స్వభావ స్వరూపం ఈయనకు కూడా ఉంది. వారివలెనే, ఈయన కూడా "ఆయన" అనే పురుష సంబోధక సర్వనామంలో సూచింపబడ్డాడు. దేవత్వంలోని యితర వ్యక్తులతో జతగా పలుకబడినప్పుడు, ఆయన మూడవ వ్యక్తిగా ప్రస్తావించ బడ్డాడు. నడిపింపబడినవానికిని, బోధింపబడడానికిని ఈయనయే సాధనమై యున్నట్టు క్రొత్త నిబంధనలో పలుకబడ్డాడు. లేఖనముల ద్వారా ఆయన మనకు సహాయకుడై యున్నాడు. పాత, క్రొత్త నిబంధనలను ఆయన ప్రేరేపించినవాడై యున్నాడు; గనుక, లేఖనాలు "ఆత్మఖడ్గము" అని సూచింపబడ్డాయి (ఎఫెసీ. 6:17), ఆయన తన పని జరిగించడానికి లేఖనాలను సాధనంగా ఉపయోగించుకుంటాడు. ఎవరైతే దేవుని పిల్లలై యున్నారో, వారిలో ఆయన నివసిస్తాడు (1 కొరింథీ. 6:19, 20).

ఈ ముగ్గురును నిత్యత్వంలో ఉన్నవారై దేవత్వమైయుంటారు. వారిని గూర్చి మనకు ఎక్కువగా తెలియకపోయినా, వారిలో ప్రతి ఒక్కరు ఉన్నారని, ఈ ముగ్గురు కలిసి మహిమాయుక్తమైన దేవత్వమైయుంటారని మనం నిశ్చయం కలిగియుండవచ్చు. వారు ఏకమై ఒక్కటిగానే జీవిస్తారు. వారు నిత్యులు, సృజింపబడిన వాటన్నిటికన్న వేరైయున్న, ప్రత్యేకంగా ఉన్నవారు, మరియు వారు చిత్తములోను, ఉద్దేశములోను ఏకమైయున్నారు.

ముగ్గురు వ్యక్తులుగా ఉన్న దేవత్వం యొక్క స్వభావాన్ని అధిగమించి, తండ్రియైన దేవుని గూర్చి మనకు యింకా ఏమి తెలుసు? ప్రాథమికంగా, ఆయనను గూర్చి బైబిలు ఒక గొప్ప సత్యాన్ని మనకు బోధిస్తుంది. అదేమంటే, ఆయనే అద్వితీయ సత్యదేవుడై యున్నాడు, ఆ విధంగా ప్రతి వ్యక్తి ఆయనను ఆరాధించవలసియుంది. ఈ సత్యం బలంగా బోధింపబడినట్టు చూడకుండ బైబిల్లో ఏ భాగాన్నైనా – అది పాత నిబంధనవేగాని క్రొత్త నిబంధనవేగాని ఎవడును చదువలేడు.

"తండ్రియైన దేవుడు ఎవరు?" అనే ప్రశ్నను యిక ముందుకును ఆలోచన చేద్దాం.

## మన సృష్టికర్త

దేవుడు సమస్తమును సృజించినవాడు. ఆయన అన్నిటిని చేసినవాడు, మరియు సమస్తానికి ఆయన యజమాని. ఆయన చేయనిదో లేక చేయబడడానికి అనుమతించనిదో ఉనికిలోనికి రాదు. ఉనికిలో ఉన్నదంతా ఆయనకు చెందినదే.

భూమి మరియు మానవ జాతి అకస్మాత్తుగా వృద్ధిపొందినవి కావు; అవియన్నియు దేవుని కరుణాహస్తమువలన సృజింపబడినవే. అందువలన, విజ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన భూమికిగల వయస్సును (డేటింగ్) గూర్చి మనం అందోళన పడనక్కరలేదు. లోకానికి అద్భుతమైన ఆరంభముంది; అది నిజంగా ఉన్నదానికంటే పాతదిగా కన్పిస్తుంది. కొంతమేరకు, దేవుడు పరిపక్వమైన భూమిని సృజించాడు. ఆయన మనిషిని మోసము చేయతలచుకోలేదు, కాని మానవ నివాస యోగ్యంగా ఉండడానికి పూర్ణంగా ఎదిగిన లేక అభివృద్ధిచెందిన భూమిని ఉనికిలోనికి తెచ్చాడు.

మొదటి దంపతులైన ఆదాము హవ్వలను శిశువులుగా కాక, పూర్ణంగా ఎదిగిన వారుగా ఉండేలా ఆయన రూపించాడు. వారిని ఆయన సృజించిన దినమున మనం అక్కడ ఉండియున్నట్టయితే, వారు ఇరవై ఏండ్ల ప్రాయములో ఉన్న దంపతులుగా మనకు కన్పించియుండేవారే; కాని వారికి అప్పుడే ప్రాణం యివ్వబడింది. ఆలాగుననే, ఆరంభంలో పూర్తిగా పెరిగిన వృక్షజాలము, నీరు, గాలి, ప్రాణాన్ని నిలబెట్టే మట్టి అనే వాటితో భూమి దేవుని అద్భుతమైన సృష్టిచేత రూపించబడింది.

దేవుడు సర్వాన్ని సృష్టించాడనే సత్యంతో దేవుని గూర్చి మనం ఎరుగవలసిన యితర సత్యాలు వెంబడిస్తాయి. అవి ఏవి?

**వాస్తవాలన్నిటి వెనుక ఆయన ఉన్నాడు.**

ఉనికిలో ఉన్నవన్నీ రెండు రకాలుగా విభజింపబడవచ్చు: దేవుడైయున్నది మరియు

దేవుడు కానిదైయున్నది. దేవుడు మొదటి ప్రాథమిక వాస్తవమైయున్నాడు. ప్రతిదీ ఆయనచే సృజింపబడినదైనా అయ్యుండాలి లేదా సృజింపబడేలా ఆయన అధికారంచే అనుమతింపబడినదైనా అయ్యుండాలి. అలా సృజింపబడినది ఏదైనా అది దేవుడై యుండనేరదు.

**ఆయన నిత్యుడు.**

> పర్వతములు పుట్టకమునుపు భూమిని లోకమును నీవు పుట్టింపకమునుపు యుగయుగములు నీవే దేవుడవు (కీర్తన. 90:2).
>
> నీవు ఏకరీతిగా నుండువాడవు నీ సంవత్సరములకు అంతము లేదు (కీర్తన. 102:27).

దేవుడు ఆది లేనివాడును, అంతము లేనివాడునైయున్నాడు. నిత్యత్వములోని ఒక చోట ఆయన కాలాన్ని సృజించినవాడై, ఆయన కాలారంభానికి ముందుగా ఉన్నవాడు. ఆయన నిత్యము ఉన్నవాడైయున్నందున మానవ భూత, వర్తమాన, భవిష్యత్తుల కాలంలో ఒక క్షణంలా ఆయనకు ఉంటాయి. నిత్యపు నేటిలో ఆయన జీవిస్తారు. ఆయన ప్రస్తుతాన్ని ఎలా చూస్తారో భూత, భవిష్యత్తులను సహితము అలాగే చూస్తారు. ఆయన నిరంతరం ఉన్నాడు, ఆయన నిరంతరం ఉండబోతాడు.

**ఆయన సర్వశక్తుడు.**

> యెహోవా, ప్రభువా సైన్యములకధిపతియగు యెహోవా అను పేరు వహించువాడా, శూరుడా, మహాదేవా, నీ యధికబలముచేతను చాచిన బాహువుచేతను భూమ్యా కాశములను సృజించితివి, నీకు అసాధ్యమైనదేదియు లేదు (యిర్మీయా 32:17).
>
> నేను యెహోవాను, సర్వశరీరులకు దేవుడను, నాకు అసాధ్యమైనదేదైనా నుండునా? (యిర్మీయా 32:27).

తన స్వభావానికి అనుకూలమైనంత మట్టుకు ఆయన ఏదైనను చేయగలడు. ఆయన దుష్టత్వంవైపు యిష్టంగా చూడలేడు, మరియు ఆయన కీడుచే శోధింపబడనేరడు. ఎందుకంటే ఆయన నీతిమంతుడై యున్నాడు (హబక్కూకు 1:13). తన విశ్వాస్యతనుబట్టి లేక ఆయన నమ్మదగినవాడై యున్నందున, తన స్వభావానికి విరోధంగా ఏమియు చేయనేరడు (2 తిమోతి 2:13). మరియు ఆయన అబద్ధమాడలేడు (తీతు 1:2). ఏదియెలాగున్నా, తన స్వభావానికి అనుకూలమైనదేదైనా ఆయన చేయగలడు. ఆయనకు

అసాధ్యమైనది ఏదియు లేదు.

**ఆయన సర్వమును ఎరిగినవాడు.**

> నేను సమీపముననుండు దేవుడను మాత్రమేనా? దూరముననుండు దేవుడనుకానా? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా–నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగలవాడెవడైనకలడా? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా? ఇదే యెహోవా వాక్కు (యిర్మీయా 23:23, 24).
>
> యెహోవా కన్నులు ప్రతి స్థలముమీద నుండును చెడ్డవారిని మంచివారిని అవి చూచుచుండును (సామెత. 15:3).

ఆయనకు ప్రతిదీ వెంటనే, ఉన్నది ఉన్నట్టు, పరిపూర్ణంగా తెలుస్తుంది. ఆయన నేర్చుకొనవలసినది ఏదీ ఉండదు. ఆయనకు సలహాదారుడో, ఉపాధ్యాయుడో, మరియు ఏ సమాచారమో అవసరమైయుండదు. తెలిసికోగలిగిందంతా ఆయనకు తెలుసు.

**ఆయన ప్రతిచోట ఉంటాడు.**

> నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును నీ కుడిచేయి నన్ను పట్టుకొనును – "అంధకారము నన్ను మరుగుచేయును నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేననుకొనిన యెడల" చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి (కీర్తన. 139:7–12).
>
> … ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు. మనమాయన యందు బ్రదుకుచున్నాము, చలించుచున్నాము ఉనికి కలిగియున్నాము,… (అపో. 17:27, 28).

మనము ఎక్కడికి వెళ్లినా, దేవుడు అక్కడ ఉన్నాడు. మనము ఆయననుండి దాగలేము సరిగదా, సర్వం చూచే ఆయన కన్నులనుండి మనం ఏదీ దాచలేం. దూరంగాని, చీకటిగాని ఆయన సముఖంనుండి మనలను దూరం చేయనేరవు.

**ఆయనే సజీవుడును సత్యదేవుడునై యున్నాడు.**

ఆయన సజీవుడు (మత్తయి 16:16), మరియు ఆయన సత్యవంతుడు (1 థెస్స. 1:9). కుమారుడు తన తండ్రిని పోలియుండులాగున, కొన్ని విషయాలలో నరులు

తమ సృష్టికర్తయైన దేవుని పోలియుంటారు. నరునివలెనే, దేవుడు చూస్తాడు, వింటాడు, మాట్లాడుతాడు, సంకల్పిస్తాడు, కార్యాలు జరిగిస్తాడు. అయినా, దేవుడు కన్పించడు; ఒకే సమయంలో ఎక్కడైనా ఉండగలిగే ఆత్మయైయున్నాడు (యోహాను 4:24).

అలాటప్పుడు, తండ్రియైన దేవుడు ఎవరు? ఆయన నిత్యుడు, సర్వమునకు సృష్టికర్తయైయున్నాడు, సర్వజ్ఞాని, సర్వశక్తుడు, ఆయన ప్రతి స్థలములో ఉన్నవాడై యున్నాడు.

దేవుడు సమస్తమునకు సృష్టికర్తయైనందున, ప్రతిదీ ఆయనకు సొంతమైయుంది. మరియు ఆయన మన ఆరాధనకు పాత్రుడైయున్నాడు. భౌతికమైన వస్తువులన్నియు ఆయన సొత్తయి ఉన్నాయి, భూమిమీదనున్న సమస్త జీవులును ఆయనవే. మరియు భూమిమీద సమస్త శరీరులును ఆయనవారే. ఆయనను మనము ఆరాధించి సేవించడం యుక్తమే. మరియు ప్రత్యేకమైన గౌరవం యిచ్చి, మరియొక దేవతను కల్పించుకొని దానికి ఆరాధన సల్పినట్లయితే, మనము అబద్ధాన్ని సేవించి, ఆరాధించువారమై యుంటాం.

## మన పోషకుడు

దేవుడు ఈ లోకాన్ని సృజించినవాడు మాత్రమేగాక, నేడును ఆయన దానిని కాపాడుతునే ఉన్నాడు. అది పడిపోకుండ, విడిపోకుండ, పని చేయడంలో తప్పి పోకుండ, తాను ఉద్దేశించినట్టు ఆయన దానిని నిలుపుతున్నాడు (కొలస్సీ. 1:16, 17).

ఈ వాస్తవం తార్కిక జ్ఞానంవలనను ప్రత్యక్షతవలనను బయలుపడుతుంది. దేవుడు ఈ లోకాన్ని సృజించి, దానిని నిర్వహించుకొంటూ వస్తున్నట్టు తార్కిక జ్ఞాన వివేచన తెలుపుతోంది. ఈ భూమిలో ఉన్నదేదియు తనకు తాను నిర్వహించుకోలేదు. ఏదో యొక సర్వశక్తిగల హస్తమే దానిని ఏకంగా నిలుపుతూ ఉందనేది స్పష్టమైయుంది. నరుడు తనను తానే సంరక్షించుకోలేడు. అంటే, తాను పీల్చుకొనే గాలిని గాని, త్రాగే నీటిని గాని, తనకు అవసరమైన సూర్యరశ్మినిగాని నరుడు సృజించుకోలేడు. భూమి ఎలా తిరగాలో అలా తిరిగేదానిమీదనే అతడు పూర్ణంగా ఆధారపడియుండాలి.

దేవుని గ్రంథంయొక్క ప్రత్యక్షత ఏమి తెలియజేస్తుందంటే, దేవుడే ప్రపంచాన్ని ఏకంగా నిలుపుతున్నాడట. అంటే, ఆయన భూమ్యాకాశాలను సృజించినప్పుడే విశ్వం నిర్వహించబడునట్లు ప్రకృతి సిద్ధమైన చట్టాలను ఆయన నియమించాడు.

దేవుడు-పగటిని రాత్రిని వేరుపరచునట్లు ఆకాశవిశాలమందు జ్యోతులు

కలుగును గాకనియు, అవి సూచనలను కాలములను దిన సంవత్సరములను సూచించుటకై యుండుగాకనియు పలికెను (ఆది. 1:14).

దేవుడు–ఇదిగో భూమిమీదనున్న విత్తనములిచ్చు ప్రతి చెట్టును విత్తనములిచ్చు వృక్షఫలముగల ప్రతి వృక్షమును మీకిచ్చియున్నాను; అవి మీ కాహారమగును. భూమిమీదనుండు జంతువులన్నిటికిని ఆకాశ పక్షులన్నిటికిని భూమిమీద ప్రాకు సమస్త జీవులకును పచ్చని చెట్లన్నియు ఆహారమగునని పలికెను. ఆ ప్రకారమాయెను (ఆది. 1:29, 30).

ప్రకృతి చట్టాలను నిర్వహించడంతోపాటు, తన దైవికమైన సంరక్షణతో అటు విశ్వాన్ని, యిటు విశ్వానికి సంబంధించిన శక్తులన్నిటిని ఆయన నిలుపుతున్నాడు.

నీవే, అద్వితీయుడవైన యెహోవా, నీవే ఆకాశమును మహాకాశములను వాటి సైన్యమును, భూమిని దానిలో ఉండునది అంతటిని, సముద్రములను వాటిలో ఉండునది అంతటిని సృజించి వాటినన్నిటిని కాపాడువాడవు. ఆకాశ సైన్యమంతయు నీకే నమస్కారము చేయుచున్నది (నెహెమ్యా 9:6).

ప్రత్యేకించి ఆయన నరుని, జంతువులను కాపాడుతున్నాడు లేక భద్రపరస్తున్నాడు: "... యెహోవా, నరులను జంతువులను రక్షించువాడవు నీవే" (కీర్తన. 36:6). ఆయన భూమిమీదనుండు సకల జీవులకు పోషకుడు ఆయనే: "పశువులకును అరచుచుండు పిల్లకాకులకును ఆయన ఆహారమిచ్చువాడు" (కీర్తన. 147:9). ఆకాశపక్షులను ఆయన లక్ష్యపెట్టువాడు: "ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్ఠులుకారా?" (మత్తయి 6:26). "రెండు పిచ్చుకలు కాసుకు అమ్మబడునుగదా; అయినను మీ తండ్రి సెలవులేక వాటిలో ఒకటైనను నేలనుపడదు" (మత్తయి 10:29). లోకజనముల యొక్క దేశములపై ఆయన ఏలువాడైయున్నాడు: "జనములను విస్తరింపజేయును, నిర్మూలముచేయును, సరిహద్దులను విశాలపరచును, జనములను కొనిపోవును" (యోబు 12:23). నీతిమంతులను ఆయన కాపాడి వారిని దీవించును: "ఒకడైనను నిలువకుండ అపరాధులు నశించుదురు; భక్తిహీనుల సంతతి నిర్మూలమగును. యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము. బాధ కలుగునప్పుడు ఆయనే వారికి ఆశ్రయ దుర్గము" (కీర్తన. 37:38, 39); "మీ తల వెండ్రుకలన్నియు లెక్కింపబడి యున్నవి గనుక మీరు భయపడకుడి; మీరనేకమైన పిచ్చుకలకంటె శ్రేష్ఠులు" (మత్తయి

10:30). తన యొద్దకువచ్చి, తనకు లోబడువారికి ఆయన నిత్యజీవము నిచ్చును: "నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు, ఎవడును వాటిని నా చేతిలోనుండి అపహరింపడు. వాటిని నాకిచ్చిన నా తండ్రి అందరికంటె గొప్పవాడు గనుక ..." (యోహాను 10:27, 28).

లోకంలోని అనేక పట్టణాలలో ఏదో యొక రకమైన రవాణా సౌకర్యం ఉంటుంది. దీనికి సంబంధించిన వాహనాలను శ్రద్ధగా చూచుకోవాలి అనేది వాస్తవమే. ఆయిల్ మార్చుతూ, విరిగిపోయిన భాగాలను మార్చుకొంటూ వగైరా రిపేర్లు చేయించకపోతే త్వరలోనే వాటిని రోడ్డు ప్రక్కన విడిచిపెట్టవలసి వస్తుంది. యంత్రాలన్నింటికి మెయిన్‌టెనెన్స్ అవసరం. సంరక్షణ అవసరంలేని యంత్రాలను మనమెరుగము. భూమికూడ ఒక మహా గొప్ప యంత్రమైయుంది. దాన్ని కూడా జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. పరలోకపు దేవుని కుమారుడు తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుతున్నట్టు బైబిలు అంటుంది (హెబ్రీ. 1:3).

మనలను కాపాడుతూ, మన అవసరతలను తీర్చుతున్నందుకు మనము దేవునికి ఎంత రుణస్థులమైయుండాలి! దేవుని కరుణాహస్తపు ఈవులు మానవ ప్రయోజనం కొరకైనవని ఎవడును సందేహింపకూడదు (అపో. 14:17). ఎందుకంటే, మంచివారి మీదను చెడ్డవారిమీదను తన సూర్యుని ఉదయింపజేస్తున్నాడు (మత్తయి 5:45). నమ్మకస్థులై నడుచుకొనేవారికి ఏ మేలు కొదువై యుండదనే కథ ఆయనను సేవించేవారి జీవితంలో రుజువైయుంది (కీర్తన. 84:11; రోమా 8:28).

## మన విమోచకుడు

దేవుడు మన విమోచకుడును రక్షకుడునైయున్నాడు. ఆయన మనలను ప్రేమించి మనలను మన పాపమునుండి రక్షింపగోరతాడు. నిత్యత్వముకొరకైన మన నిరీక్షణ ఆయనయందే ఉంది.

మనకొరకైన ఆయన ప్రేమ వివరింప కష్టమైయుంటుంది. మనమెరిగిన మానవ ప్రేమ అంతటికంటె మించినదైయుంటుంది. తమ కోరికను బట్టియే జనులు పాపము చేసి ఆయననుండి తమ్మును తాము దూరం చేసికొన్నప్పటికిని, ఆయన వారిని రక్షింపగోరతాడు. మన రక్షణ కొరకై కడపటి బలిని సమర్పించడానికి గాను ఆయన క్రీస్తును ఈ లోకమునకు పంపి ఆయన ద్వారా దేవుడు మానవులకు రక్షణ ననుగ్రహించడానికి

సిద్ధంగా ఉన్నాడు.

దేవుడు, సంపూర్ణంగా నీతిమంతుడైయుండి, పాపాన్ని ఊరకయే మన్నించలేడు. నిత్య మరణం అనుభవించకుండ మన పాప శిక్షను మనం చెల్లించలేం. మన పాపశిక్షను భరించడానికిగాను దేవుడు క్రీస్తును సిలువ మరణానికి అప్పగించాడు. రక్షణ సందేశాన్ని అంగీకరించి విధేయుడైన ఎవడైనా క్రీస్తు మరణము యొక్క ఉపకారమంతటిని పొందుతాడు. ఈ విధంగా దేవుడు మన రక్షకుడైయున్నట్టు (తీతు 1:3), క్రీస్తు మన రక్షకుడైయున్నట్టుగానే (తీతు 2:13) బైబిలు వర్ణిస్తుంది. దేవుడు మన విమోచనను జగత్తు పునాది వేయబడకముందే సంకల్పించాడు (1 పేతురు 1:20). జనులు ఆయన సందేశాన్ని విని, మారుమనస్సు పొంది (వారి మనస్సులను జీవితాలను మార్చుకొని), ఆయన రక్షణను స్వీకరించిన వారికొరకు ఆయన ప్రేమతో వేచియున్నాడు (2 పేతురు 3:9).

ఎప్పుడూ తిట్టే తండ్రిని కలిగిన ఒక బాలుని చిత్రించుకో. అతడు తిట్టడానికే తన కుమారునితో మాట్లాడతాడు. ఆ బాలుడు ఎప్పుడు తప్పు చేసినా, వాని తండ్రి వానిని కొట్టుతూ ఉంటాడు. తన తండ్రితో ఈలాటి బాంధవ్యంలో కొన్ని సంవత్సరాలు జీవించిన పిమ్మట, తన తండ్రి కఠినమైన తీర్పరియేగాని, ప్రేమగల తండ్రి కాదని అతడు తీర్మానించుకున్నాడు. అతడు తన తండ్రి అంటే భయపడతాడే తప్ప అతనిని ప్రేమించడు. కనీసం ఆయన ప్రక్కన ఉంటే కూడా యితనికి నచ్చదు. “తండ్రి” అనే మాట అతడు ఎప్పుడు విన్నా, కొడతాడో తిడతాడో అనే తలంపే కలుగుతుంది. తండ్రియనే మాట వ్యక్తపరచే లేక తెలియజేసే రమ్యమైన భావం ఆ దురదృష్టవంతుడైన బాలుడు కనుగొనడం కష్టమే.

“దేవుడు” అనే మాట వినగానే కొందరికి ఆలాటి భావాలు వస్తాయి. తప్పుచేసే దానికొరకు కనిపెట్టి, తప్పు చేసిన మీదట నెట్టివేయడమో నరకంలో పడవేయడమో చేసే కఠినమైన తీర్పరియన్నట్టు తమ జీవితాల్లో అనేకులు ఉపదేశింపబడియుండ వచ్చు. దేవుడు మనకు తండ్రియైయున్నట్టు ప్రభువైన యేసు బోధించాడు. మనం ప్రార్థన చేసే సమయంలో “తండ్రీ” అని పిలువుడని (మత్తయి 6:9) ఆయన మనకు తెలిపాడు. మన పట్ల ఆయనకున్న ప్రేమ త్యాగపూరితమైనది (యోహాను 3:16). ఆయన మన పట్ల కనుపరచిన ప్రేమకంటె మించిన ప్రేమను మనం ఊహించలేం. ఆయన మన సహవాసాన్ని కోరుతున్నాడు. ఆయనకు విధేయులమైనప్పుడు, మనలో నివసించాలని ఆయన యిష్టపడుతున్నాడు (యోహాను 14:23). ఆయనను విడిచి మనం తొలిగి పోయినట్లయితే, మనం మారుమనస్సు పొంది తిరిగి వచ్చినప్పుడు

ప్రేమించిన క్షమాపణతో ఆయన తిరిగి మనలను స్వీకరిస్తాడు (లూకా 15:19-32).

ఏ నరుడైనా మనకు చేయగలిగిన దానికంటే ఎక్కువగా, దేవుడు మనకు మేలు చేశాడు. ఆయన చూపిన గొప్ప ప్రేమకు మనం ఎలా బదులివ్వాలి? తిరిగి మనం ఆయనను ప్రేమించాలి, ఆయన వాక్యానికి విధేయులగుటవలనను, ఆయనను ఆరాధించుటవలనను, ఏకైక దేవుడని ఆయనను మనం ఘనపరచవలసియుంది. ఆయన సన్నిధిని మనము  భయభక్తులతోను గౌరవంతోను బ్రతుకవలసియుంది.

## మన న్యాయాధిపతి

ఆయన మన ప్రేమగల కనికరముగల తండ్రియైయున్నా, దేవుడు మనకు న్యాయాధిపతియై యుంటాడు. కాలాంతమందు మనము ఆయనకు లెక్క చెప్పవలసి యుండును.

మనలను సృజించిన వానికి మనం లెక్క చెప్పాలని నమ్మడం సమంజసమే – సరియైనదని మన తార్కికజ్ఞానం చెప్పేది, సత్యమని బైబిలు ప్రకటిస్తుంది (ప్రకటన 20:12). దేవుడు మనకు ఎలా తీర్పు తీర్చుతాడు? ఆయన తీర్పు వ్యక్తిగతమైనది. ప్రతి వ్యక్తి తనను గూర్చి తాను లెక్క చెప్పవలసియుంటుంది (రోమా 14:12). ఆయన తీర్పు నిర్దిష్టమైనది, ప్రతివాడు తాను చెప్పిన (మత్తయి 12:36, 37) మరియు చేసిన (2 కొరింథీ. 5:10) వాటికి బాధ్యుడుగా ఎంచబడతాడు. ఆయన తీర్పు సార్వత్రిక మైనది, సమస్త జనులు తన కుమారునియెదుట పోగుచేయబడతారు (మత్తయి 25:32).

యేసు క్రీస్తు ద్వారా దేవుడు మనకు తీర్పు తీర్చుతాడు. నీతి ఆయన కొలమాన మైయుండి (అపొ. 17:30, 31), ఆయన తీర్పు అంతిమమైనది, శాశ్వతమైనది (మత్తయి 25:46). ఆయన తీర్పు చెప్పిన తరువాత వేరే స్థలంలో ఫిర్యాదు చేసికోబడదు లేక ఫిర్యాదుకు చోటుండదు.

రెండు వాహనాలు ఒక దానితో ఒకటి గుద్దుకున్నప్పుడు స్పృహ తప్పి పడిపోయిన ఒక యువకుని కథ చెప్పబడింది. ఆ వాహనాలు మంటల్లో అలుముకొనకముందు ఆ దృశ్యాన్ని చూచిన ఒక వ్యక్తి ఈ యువకుని ప్రక్కకు లాగాడట. ఆ యువకుడు కాలిపోయి ఉండవలసింది.

అలా తప్పింపబడిన మీదట, ఆ యువకుడు కండ్లు తెరువగానే, తన ప్రాణాన్ని కాపాడిన ఆ మనిషి ముఖాన్ని చూచాడట. అతడు ఆ ముఖాన్ని ఎన్నడూ మరువ లేదు. ఆ యువకుడు ఆ విపత్తునుండి తేరుకున్నాడు, సంవత్సరాలు గడిచిపోయాయి.

అతడు పెద్దవాడైన తరువాత సీరియస్ ట్రబుల్లో చిక్కుకున్నాడు. చట్టాన్ని మీరాడు, తన నేరాన్నిబట్టి అరెస్టు చేయబడ్డాడు లేక బంధింపబడ్డాడు. తీర్పుకొరకు అతడు న్యాయాధిపతి ఎదుటికి తేబడ్డాడు, కొన్ని ఏండ్లకు ముందు తన్ను రక్షించిన ఆ మనిషే ఈ న్యాయమూర్తియని గుర్తించి ఆశ్చర్యపోయాడు. వెనక ముందు ఆడకుండ, “యువర్ ఆనర్, నేను నీకు జ్ఞాపకం ఉన్నానా? కొన్ని సంవత్సరాల క్రిందట గుద్దుకున్న వాహనాలలోనుండి తప్పించి, నా ప్రాణాన్ని రక్షించావు.” ఆలోచనా పూర్వకంగా, “అవును నాకు జ్ఞాపకం ఉంది, నేను రక్షించిన వ్యక్తికి ఎంతో మేలు జరగాలని కోరుకున్నా. నీవు నీ జీవితాన్ని కొనసాగించేలా నిన్ను తప్పించినందుకు నేను ఆనందించాను. అయినా, నీవు ఈ వాస్తవాన్ని చూడాలి: సంవత్సరాల క్రిందట, వాహనంలోనుండి నిన్ను బయటికి లాగినప్పుడు, నేను నీకు ‘రక్షకుడను’; కాని నేడు నేను నీకు ‘న్యాయాధిపతినై’ యున్నాను.”

బైబిల్లో దేవుడు రక్షకుడుగాను, న్యాయాధిపతిగాను చిత్రింపబడ్డాడు. పాపంనుండి విడిపించి తప్పించడానికి ఆయన తన కుమారుని పంపాడు. మనలను రక్షించడానికి అత్యున్నతమైన బలిని మనకొరకు అర్పించాడు. మనం దాన్ని లక్ష్యపెట్టకపోతే, ఆయన రక్షణను మనం త్రోసిపుచ్చితే, ఏమి జరుగుతుంది? ఆయన న్యాయాధిపతి గనుక ఆయన మనలను శిక్షింపవలసియుంటుంది.

జీవితంలో మనకు ఒక ప్రధాన కర్తవ్యముంది. దేవుడు ఎవరో మనం గుర్తించి నప్పుడు, ఆయన చిత్తానికి మనం విధేయతతో వంగిపోవాలి. సజీవుడును సత్యవంతుడైన దేవునిగా ఆయనను మనం ఆరాధించాలి. అలాటి విధేయతకు ఆయన వాక్యాన్ని తెరిచి, జాగ్రత్తగా చదవాలి. ఆయన మనకు నిత్య తీర్పరిగా మాత్రమేకాదు, ప్రేమగల రక్షకుడై కూడా ఆయన ఉండ కోరుతున్నాడు.

## ముగింపు

దేవుని గూర్చిన ఈ వాస్తవాల వెలుగులో, ఆయనను గూర్చి ఏదోయొక అభిప్రాయం లేకుండ మనం ఉండలేం. ఆయనను గూర్చి మనం ఏదో ఒక నిర్ణయం చేసికోవలసి యుంటుంది. న్యాయసమ్మతమైన ఒకే తీర్మానమేమంటే, అద్వితీయ సత్య దేవునిగా ఆయనను గుర్తించి, విశ్వాసంతోను, విధేయతతోను ఆయనను సేవించు.

ఒక స్కూలు టీచర్ తన క్లాసులో యిలా చెప్పిందట, “స్వీడన్‌వాడైన కర్ల్‌షీలీ, ఇంగ్లాండువాడైన జోసప్ ప్రీస్ట్లీ అనే రసాయన శాస్త్రజ్ఞులు 1775లో ప్రాణ వాయువును

కనుగొన్నారు," వెంటనే ఒక చిన్న బాలిక తన చేయి ఎత్తి యిలా అడిగిందట, "వారు ప్రాణవాయువును కనుగొనకముందు మనం ఏమి పీల్చుకొంటూ ఉండేవారము?" ప్రాణవాయువు మన వాతావరణంలో ఎల్లప్పుడు ఉంది అది మనకు తెలియలేదు లేక ఆ శాస్త్రజ్ఞులు కనిపెట్టేవరకు ఆ పేరు లేదు అని వివరింపవలసి వచ్చిందనుకో.

మన లోకము రెండు రకాలైన వాస్తవాలతో నిర్మింపబడింది: మన కండ్లతో చూచి, మన చేతులతో తాకి, చూడగల వాస్తవాలు; మరియు మనం చూడనుగాని తాకనుగాని కుదరని వాస్తవాలు. మొదటి రకమైన వాస్తవాలు మనకు బహుగా విదితమైయుంటాయి – ఎందుకంటే మనం చేతులతో పట్టుకొని వాటితో పని చేస్తాం. రెండవ రకమైన వాస్తవాలు మనకు అంత స్పష్టంగా ఉండవు. వాటిని మనం అంతగా పట్టించుకోము. అవి ఉన్నాయని మనకు తెలుసు, కాని అవి కొన్ని సార్లు మన ఆలోచనలకు వెనుక ఉంటాయి. మనస్సుల్లో, మన గాలిలో ఐదవ భాగం ప్రాణవాయువని మనం ఎరుగవచ్చు మరియు దాన్ని పీల్చకుండ మనం బ్రతుకలేం అని కూడా మనకు తెలియవచ్చు. దాన్ని గూర్చి మనం పట్టించుకోము, మనం కేవలం దాన్ని పీల్చుకొంటాం. అదృశ్య వాస్తవమైయున్న గాలికంటె కూడా మనం తీసికొని వ్రాసే పెన్సిల్ ఉందని కన్పించే వాస్తవాన్ని ఎరుగుతాం.

అసలు పాయింటు ఏమంటే: వాస్తవాలను మనం చూడలేనంత మాత్రాన అవి నిజమైనవి కాదని అర్థం కాదు. మనం చూసే వస్తువులు ఎంత నిజమో మనం చూడకపోయినా, తాకకపోయినా సరే అదృశ్య వాస్తవాలు కూడా అంత నిజమైనవే.

దేవుని మనం చూడలేమనేది గొప్ప వాస్తవమైయుంది. మన భౌతికమైన చేతులతో ఆయనను మనం తాకలేం, ఆయనను పరీక్ష నాళికలో పెట్టి గ్రహించలేం; లేదా మన భౌతిక నేత్రాలతో ఆయనను చూడనూలేం; అయినా ఆయన అత్యున్నతమైన వాస్తవమైయున్నాడు. సమస్త వాస్తవాలకు ఆయనే ఆధారమై యున్నాడు – ఆ వాస్తవం దృశ్యమైనదైనా, అదృశ్యమైనదైనా.

నిజ దేవుని గూర్చి మిషినెరీ కొంతమంది మనుష్యులకు చెప్పుతున్నాడు. దేవుని యొక్క సర్వశక్తిని, ఆయన ప్రేమను, ఆయన జ్ఞానాన్ని గూర్చి అతడు వారికి వివరిస్తున్నాడు. ఒక వృద్ధుడు ఎక్కువ శ్రద్ధతో ఆ మాటలను ఆలకిస్తున్నాడు. కొద్ది నిమిషాల తరువాత, ఆ వృద్ధుడు లేచి నిలిచి "దేవుడు ఉన్నాడని నాకు తెలుసుగాని, యిప్పటివరకు కూడా ఆయన పేరు నాకు తెలియదు!" అని తన ఆశ్చర్యాన్ని వ్యక్తపరచాడట.

దేవుడు మన సృష్టికర్త, మన పోషకుడు, విమోచకుడు మరియు న్యాయాధిపతియునై

యున్నాడు. ఆయన ఉనికిని కాదనేవాడుగాని లేక ఆయనకు లోబడి ఆయనను సేవించడంలో తప్పిపోయే ఎవడైనా చేయ సాధ్యపడేంత మహా గొప్ప తప్పు చేసిన వాడౌతాడు. ఆ వ్యక్తి తన్ను సృజించిన వానిని కాదనడంలో, తన ఉనికి వెనుకను, ఈ విశ్వం ఉనికి వెనుకను ఉన్న మహత్తరమైన వాస్తవాన్ని నిరాకరించినట్లే ఔతుంది. ఈ తప్పు చేయవద్దు సుమీ! అద్వితీయ సత్యదేవునిగా దేవుని ఆరాధించు; వినయంతో కూడిన విధేయతతో ఆయన ఎదుట మ్రొక్కు.

దేవుడు నిన్ను ప్రేమించి, తన కుటుంబములోనికి ఆయన నిన్ను ఆహ్వానిస్తున్నాడు. ఈ జీవితకాలంలో అనుదినము తనతో నడువుమని ఆయన నిన్ను కోరుతున్నాడు. నిలువరమైన పట్టణమగు పరలోకమందు తనతోకూడా నిరంతరం జీవించుమని నిన్ను కోరుతున్నాడు.

## పరిశీలనకైన ప్రశ్నలు

(*జవాబులు – 246వ పేజీలో*)

1. "దేవుడు" అనే పదం న్యాయసమ్మతంగా ఒకరికే చెందుతుంది ఎందువలన?
2. దేవత్వమును సూచించే పాత నిబంధన లేఖన భాగాలను తెలుపుము.
3. దేవత్వము ఒక్కటైయుండి అందులో ముగ్గురు వ్యక్తులున్నారనడానికి – యేసు బాప్తిస్మము, మానవ విమోచనా కార్యము, ప్రార్థన, ఘనత్వముగల ఉత్తరువు (Great Commission) బాప్తిస్మము – సపోర్టు చేస్తున్నాయి?
4. దేవుని యొద్దకు వచ్చుటకు నరునికి లభ్యమయ్యే ఏకైక మార్గమేది?
5. దేవదూతలు, పరిశుద్ధులు, లేక యితర మృతులుగాని సజీవులైన జనులు వారి ద్వారా దేవుని సమీపించలేమని బోధించే లేఖనాలేవి?
6. ప్రభువైన యేసు అటు, "మనుష్యకుమారుడు" గాను, ఇటు "దేవుని కుమారుడు" గాను ఎలాగైయుంటాడు?
7. దేవత్వంలోని సభ్యులను గూర్చి మనకు అంత ఎక్కువ తెలియకపోయినా, మనం నేర్చుకోగలిగింది చాలా ఉంది. బైబిల్లో బోధింపబడిన కొన్ని వాస్తవాలేవి?
8. దేవుడు సమస్తాన్ని సృజించాడనే సత్యాన్ని వెంటాడే సత్యాలేవి?
9. దేవుడు ఈ లోకంలో పని చేస్తూనే ఉన్నాడనడానికి రుజువేమి?
10. దేవుడు మనకు ఎలా తీర్పు తీర్చుతాడు?

## పద సహాయకారి

**అపొస్తలులు –** తన ప్రత్యేకమైన వర్తమానికులుగా ఉండడానికి ప్రభువు ఏర్పరచుకొన్న పన్నెండు మంది శిష్యులు (మత్తయి 10:2–4). యూదా మరణానంతరం మత్తీయ అపొస్తలులలో ఒకడుగా చేర్చబడ్డాడు (అపొ. 1:23, 26). తరువాత పౌలు వారితో కూడా చేర్చబడ్డాడు (అపొ. 9:15, 16; 1 తిమోతి 2:7). అపొస్తలుల దైవ ప్రేరేపితమైన ప్రకటనకు ఉపదేశమునకు లోబడాలని ప్రభువు ఆదేశించారు (మత్తయి 16:19).

**బాప్తిస్మము –** "నీటిలో ముంచబడుట" అనే గ్రీకు పదంనుండి వచ్చింది. పాపక్షమాపణకొరకు విధిగా దేవుడు బాప్తిస్మాన్ని నియమించాడు (మత్తయి 28:19, 20; రోమా 6:1–4; అపొ. 2:38; 8:36లను చూడు).

**క్రైస్తవుడు –** క్రీస్తు సువార్తకు లోబడినవాడు.

**ఒప్పుకొనుట –** యేసు క్రీస్తు దేవుని కుమారుడనే తన విశ్వాసాన్ని వ్యక్తపరచడం మరియు ఆయనను ప్రభువుగాను రక్షకునిగాను అంగీకరించడం (అపొ. 8:37; రోమా 10:10; 1 తిమోతి 6:12లను చూడు).

**శిష్యుడు –** నేర్పు పొందువాడు, లేక వెంబడించువాడు. అపొ. 11:26లో శిష్యులు క్రైస్తవులనబడ్డారు.

**సువార్త రచనలు –** ప్రభువైన యేసు యొక్క జీవితం, మరణము, మరియు పునరుత్థానాన్ని తెలుపునట్టి (మత్తయి, మార్కు, లూకా, యోహాను అనే) నాలుగు క్రొత్త నిబంధన రచనలు.

**ఘనత్వముగల ఉత్తరువు** (Great Commission) **–** ప్రతి వ్యక్తికి సువార్త ప్రకటించుడని ప్రభువైన యేసు తన శిష్యులకు యిచ్చిన ఆజ్ఞ (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16).

**మధ్యవర్తి –** సమస్యను పరిష్కరించడానికిగాను "యిరు పక్షాల మధ్య నిలుచు వాడు." దేవుని కుమారుడైన యేసే దేవునికిని, మానవునికిని మధ్యవర్తియై యున్నాడు. ఆయన పాపమనే సమస్యను పరిష్కరించువాడు.

**దేవుని కరుణాహస్తము –** దేవుడు మనుష్యులను కాపాడి, వారి అవసరాలను తీర్చువాడు. ఈ పదము క్రొత్త నిబంధనలో వాడకపోయినా, రోమా 8:28లో అది బైబిలు బోధగా కన్పిస్తుంది!

**విమోచకుడు –** "తిరిగి కొనువాడు." తన మరణం ద్వారా ప్రభువైన యేసు

తిరిగి కొన్నాడు లేక నశించిన జనుల ఆత్మలకొరకు విమోచనా క్రయధనాన్ని ఆయన చెల్లించాడు.

**విమోచన –** దేవుని విడిచి జీవించినవారిని తిరిగి కొన్నది. క్రైస్తవులు తరచుగా, "విమోచింపబడినవారు" అని సూచింపబడ్డారు.

**మారుమనస్సు –** ఒకని ఆలోచనా విధానాన్ని మార్చుకొనడం – దానిని బట్టి వాని జీవిత నడకను మార్చుకొనడం.

**పరిశుద్ధుడు –** క్రొత్త నిబంధన క్రైస్తవుడు.

**రక్షణ –** పాపమునుండి విడుదల; రక్షణ క్రీస్తు ప్రభువు ద్వారానే ప్రసాదింప బడుతుంది.

**రక్షకుడు –** అపాయమునుండి లేక మరణమునుండి ఒకని తప్పించువాడు. ప్రభువైన యేసు మన రక్షకుడు, పాపమునుండి, నిత్య మరణమునుండి ఆయన మనలను రక్షించును.

---

[1]"దేవత్వము" అని తర్జుమా చేయబడిన మూడు గ్రీకు పదాలు లేఖనాల్లో ఒక్కసారే కన్పిస్తాయి (అపొ. 17:29; రోమా 1:20; కొలస్సీ. 2:9; KJV). "దైవ కుటుంబము," "ముగ్గురైయున్న" అనే పదాలు లేఖనాల్లో కన్పించవు, ఈ పాఠంలో  వాటిని వివరణకొరకు మనం చూస్తాం. [2.]యింకా మూడు ఉదాహరణలు ఆదికాండం 3:22; 11:17; యెషయా 6:8ల్లో కన్పిస్తాయి.